
సాక్షి కృష్ణాజిల్లా

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ నిత్యాన్నదానానికి యానాంకు చెందిన వెంకట వరప్రసాద్ రూ. 1,00,004, హైదరాబాద్‌కు చెందిన జనార్దన్ రావు రూ. 1,01,000 విరాళాన్ని అందజేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 21,490 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సేవలు ప్రశంసనీయం

ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో విధులను సమర్థంగా నిర్వహించిన ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు కొనియాడారు. -8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి సంగీత సమ్మానోత్సవాలు



విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసులు వాగ్గేయకారులు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 23 నుంచి 27వ తేదీ ఆదివారం వరకు జాతీయ శాస్త్రీయ సంగీత, సమ్మానోత్సవాలు కృష్ణమాచార్యులు కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి ఎన్ సీహెచ్ బుచ్చయ్యా చార్యులు తెలిపారు. గాంధీనగర్‌లోని శివ రామకృష్ణ క్షేత్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బుచ్చాయ్యాచార్యులు మాట్లాడుతూ ఐదు రోజులపాటు నిర్వహించే సంగీతోత్సవాల్లో దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కృష్ణమాచార్యులు వారి శిష్య ప్రశిష్యులు సంగీతోత్సవంలో పాల్గొంటారని వివరించారు. సంస్థ ఉపాధ్యక్షుడు రామానుజా చార్యుడు మాట్లాడుతూ 23వ తేదీ ఉదయం శివరామకృష్ణ క్షేత్రంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయని అదే రోజు సాయంత్రం శత జయంతి ఉత్సవ సావనీర్ ఆవిష్కరణ, 27వ తేదీ ఆదివారం సాయంత్రం సంగీత విద్వాంసులు రాఘవాచారికి కృష్ణమాచార్యులు స్మారక పురస్కారం అందజేస్తారని తెలిపారు. సమావేశంలో సంస్థ సభ్యులు రంగనాయకి, రాఘవాచార్యులు, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. వివరాలతో కూడిన బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు గుడివాడ కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 10 తరగతులు పాసైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ రాత్రి 11.50 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరకాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 28వ తేదీ ప్రభుత్వ ఐటీఐలో, 30వ తేదీ ప్రైవేట్ ఐటీఐలో చేరేవారికి కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. వివరాలకు 08674-295953, 82975 74757 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

నాగుల చవితి కరపత్రాల ఆవిష్కరణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నవంబర్ 5, 2024 నుంచి డిసెంబర్ 1, 2024 వరకు వైభవంగా నాగుల చవితి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదగా నాగుల చవితి, కార్తీక మాస లక్ష బిల్వార్చన కరపత్రాలు విడుదల చేశారు. ఆలయ అధికారులు తదితరుల పాల్గొన్నారు.

హోరాహోరీగా ఐస్టా ర్యాంకింగ్ టోర్నీ



విజయవాడస్పోర్ట్స్: బెజవాడ శ్రీకృష్ణారెడ్డి, అఖిల భారత సీనియర్ టెన్నిస్ అసోసియేషన్(ఐస్టా) ర్యాంకింగ్ టోర్నమెంట్ ఇందిరా గాంధీ స్టేడియంలో రెండో రోజు మంగళవారం హోరాహోరీగా కొనసాగింది. 35 ప్లస్ సింగిల్స్‌లో మహేశ్వరరావు, నరేష్, సబరీష్, అశోక్ క్వార్టర్ ఫైనల్స్‌కు, 45 ప్లస్ సింగిల్స్‌లో కె.వి. ఎల్.మూర్తి, సంపత్, వహీద్, హరీష్, ఎం.ఎస్.కిరణ్ క్వార్టర్ ఫైనల్స్‌కు, 70 ప్లస్ సింగిల్స్‌లో రాధాకృష్ణ, టి.సుధీర్, బి.జి.రెడ్డి సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు. ఈ నెల 24వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రాధాకృష్ణమూర్తి, టోర్నీ డైరక్టర్ ఎం.మల్లికార్జున రావు తెలిపారు.



కాల్‌మనీ కేటుగాడి చేతిలో చిక్కుకుని మచిలీపట్నంలో వ్యాపారులతో పాటు ఉద్యోగులు విలవిలాడుతున్నారు. రూ.లక్షల్లో అప్పు ఇచ్చి కోట్లలో లాగేస్తున్నాడు. ఆ వడ్డీ వ్యాపారి దెబ్బకు అనేక కుటుంబాలు వీధిన పడ్డాయి. ఇతని వేధింపులు భరించలేక ఓ బ్యాంకు అధికారి ఎస్పీకి ఫిర్యాదు కూడా చేశారు. ఆ కాల్‌నాగుకు అధికార పార్టీకి చెందిన నేత అండ ఉండటంతోపాటు గంజాయి బ్యాచ్‌ను వెంట తిప్పుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.

కాల్‌మనీ కేటుగాడు

మచిలీపట్నంలో కా(ల్)నాగు

- సంపన్నుల కుటుంబాలే లక్ష్యంగా వడ్డీ వ్యాపారం
- రూ.లక్షలు అప్పు ఇచ్చి కోట్లు కొల్లగొడుతున్న వ్యాపారి
- అతని ఉచ్చులో వ్యాపారులతో పాటు ఉద్యోగులు
- న్యాయం కోసం ఎస్పీని ఆశ్రయించిన ఓ బ్యాంకు అధికారి


కోనేరుసెంటర్: జిల్లా కేంద్రం మచిలీపట్నంలో కాల్(మనీ)నాగు పడగ విప్పింది. పేద, ధనిక భేదం లేకుండా కోరలకు చిక్కిన బాధితులను కాటేస్తుంది. ఐదేళ్ల క్రితం రూ.5000తో వ్యాపారం ప్రారంభించిన సదరు దుర్మార్గుడు ప్రస్తుతం 50 కోట్లకు పడగలెత్తాడంటే అతని అరాచకాలు, ఆకృత్యాలు ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

అట్టడుగు స్థాయి నుంచి అప్పు ఇచ్చే స్థాయికి

ఒకప్పుడు అతనో నెలవారీ కూలీ. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. అతని తండ్రి పెయింటింగ్ దుకాణంలో గుమస్తా. తండ్రి నెలవారీ జీతం, అతని రోజు వారీ కూలి డబ్బులు వస్తే తప్ప కుటుంబానికి కడుపు నిండని పరిస్థితి. అలాంటి వ్యక్తి చాలా తక్కువ సమయంలో కోట్లు గడించాడు. ఒకప్పుడు స్నేహితుల వద్ద పది పరకా తీసుకుని అవసరాలు తీర్చుకున్న అతను అదే స్నేహితులకు కోట్లు అప్పులు ఇచ్చే వడ్డీ వ్యాపారిగా అవతారమెత్తాడు. అతని స్నేహితులు, పరిచయస్తులు ఇప్పుడు అతన్ని చూస్తే బెంబేలెత్తిపోయే పరిస్థితి. ధనవంతుడు కావాలనే కోరికతో రూ.5000తో కాల్‌మనీ వ్యాపారం మొదలుపెట్టాడు. మొదట్లో 5000కు రోజుకు రూ. 500 వడ్డీ కట్టేలా పేకాటరాయుళ్లకు అప్పు ఇవ్వడం ప్రారంభించాడు. క్రమంగా లక్షల్లో పెట్టుబడులు పెట్టేలా తన వ్యాపారాన్ని విస్తరించుకున్నాడు. లక్షకు 1000 చొప్పున రోజు వారీ వడ్డీకి అప్పులు ఇవ్వడం మొదలు పెట్టాడు. అలా వ్యాపారం మొదలు పెట్టిన రెండేళ్లలో అన్యాయంగా, అక్రమంగా అనేక మంది అమాయకుల నుంచి కోట్లు కొల్లగొట్టేశాడు. బెదిరించి ఆస్తులు లాగేసుకున్నాడు. అలా వ్యాపారం ప్రారంభించిన ఐదేళ్లలో దాదాపు 50 కోట్లు సంపాదించి కోటీశ్వరుడు కాగా అతని కోరల్లో చిక్కుకున్న అనేక కుటుంబాలు అప్పులుపాలై వీధినపడ్డాయి.

అరాచకాలు ఎన్నెన్నో..

మచిలీపట్నం నిజాంపేటకు చెందిన ఆ వ్యాపారి కాల్‌మనీ వ్యాపారానికి తెరలేపి సుమారు ఐదేళ్లు కావస్తోంది. నగరంలోని సంపన్న కుటుంబాల్లోని అనేక మందిని టార్గెట్‌గా చేసి అప్పులు ఇవ్వటం మొదలు పెట్టాడు. వారిలో పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిని టార్గెట్ చేసి పరిచయం పెరిగాక లక్షకు రూ. 1000 చొప్పున రోజువారీ వడ్డీకి అప్పు ఇచ్చి వసూలు చేయడం మొదలుపెట్టాడు. అతని వ్యాపారం దినదినాభివృద్ధి చెందగా అతని ఉచ్చులో పడిన అనేక మంది యువకులు లక్షలకు లక్షలు అప్పులు తీసుకుని అసలుకు పది రెట్లు చొప్పున చెల్లించి మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు మచిలీపట్నంలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.



To
The Superintendent of Police
Krishna
Machilipatnam.

ఎస్పీకి అందజేసిన ఫిర్యాదు కాపీ

కుంగిపోతున్న కుటుంబాలు

సదరు కాల్‌మనీ వ్యాపారి ఉచ్చులో పడిన అనేక కుటుంబాలు పిల్లలు చేసిన తప్పులను బయటికి చెప్పుకోలేక లక్షలకు లక్షలు అతనికి కట్టలేక లోలోన కుమిలిపోతున్నట్లు సమాచారం. వేలల్లో చేసిన అప్పుకు లక్షల్లో వడ్డీలు కట్టలేక అనేక మంది బాధితులు ఆత్మహత్య చేసుకునే ప్రయత్నాలు చేయగా విషయం కాస్త తల్లిదండ్రుల దాకా వెళ్లింది. ఎదిగిన కొడుకును వదులుకోలేక ఉన్న ఆస్తులను తెగనమ్మి వచ్చిన లక్షలాది సొమ్మును సదరు వ్యాపారి ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలా మచిలీపట్నంలోని అనేక కుటుంబాలు కోట్లు ఖరీదు చేసే స్థిరాస్తులను అతని వేధింపులు తట్టుకోలేక ఇచ్చేసినట్లు తెలుస్తోంది.

కాల్‌మనీ వ్యాపారిపై ఎస్పీకి ఫిర్యాదు

సదరు వ్యాపారి బాధితుల్లో ఒకరైన ఓ బ్యాంకు అధికారి సోమవారం జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావును మీకోసంలో స్వయంగా కలిసి సదరు వ్యాపారి వేధింపులపై ఫిర్యాదు చేశారు. ఎస్పీ చిలకలపూడి పోలీసులకు విచారణను అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న ఓ బంగారు వ్యాపారి తన కుమారుడికి జరుగుతున్న అన్యాయంపైనా ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. సదరు బంగారు వ్యాపారి కుమారుడికి వడ్డీ వ్యాపారి సుమారు 15 లక్షల వరకు అప్పుగా ఇచ్చి 45 రోజుల్లో రోజుకు 15,000 వడ్డీ చొప్పున ఇప్పటి వరకు 6.75 లక్షలను కట్టించుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఎస్పీని కలిసి అతని కాల్‌మనీ వ్యాపారంపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. వీరితో పాటు నగరానికి చెందిన ఓ మిఠాయి వ్యాపారి కుటుంబం, మరో ఐదు కుటుంబాలు ఎస్పీని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకునేందుకు పెద్దలతో కలిసి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే అతని అన్యాయాలు, అక్రమాలను కాపాడేందుకు అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి అడ్డుపడుతున్నాడని సమాచారం. ఇతనితోపాటు నగరంలోని ఓ గంజాయి బ్యాచ్‌ను సపోర్టుగా తీసుకుని సదరు కాల్‌మనీ వ్యాపారి భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు కొందరు బాధితులు వాపోతున్నారు.

ప్రత్యామ్నాయ విధానాలతో వ్యవసాయాభివృద్ధి



కృష్ణలంక(విజయవాడతూర్పు): కేరళ తరహా ప్రత్యామ్నాయ విధానాలే రైతుకు శ్రీరామరక్ష అని కేరళ రాష్ట్ర స్థానిక స్వపరిపాలన, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి ఎం.బి.రాజేష్ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యాన సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు అధ్యక్షతన మంగళవారం వ్యవసాయ రంగ సమస్యలు-కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. మంత్రి రాజేష్ మాట్లాడుతూ 1957లో సీఎం ఈఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వంలోనే ప్రత్యామ్నాయ విధాన పాలనకు బీజం పడిందని గుర్తు చేశారు. కేరళలో స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా తీర్చిదిద్దుతున్నామని, వీటికి కేటాయించే నిధుల్లో 30 శాతం వ్యవసాయ, దాని అనుబంధ రంగాల రక్షణకు ఖర్చు చేస్తున్నామన్నారు. స్థానిక ప్రభుత్వాలు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలకు భాగస్వామ్యం కలిస్తున్నామని, వాటితో మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతున్నాయని, పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, మరో వైపు జీవించాలంటే ధరలు భరించలేకుండా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో అన్ని దేశాలు 12 నుంచి 50 శాతం వరకూ రైతుకు ప్రోత్సాహం ఇస్తుంటే మన దేశంలో మైనస్ 6 శాతం ప్రోత్సాహమే దక్కుతోందన్నారు. విద్యుత్ రంగ నిపుణుడు కె.అశోక్ రావు, అఖిల భారత కిసాన్ సభ నాయకుడు పి.కృష్ణప్రసాద్ ప్రసంగించారు. సదస్సువలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, వివిధ వ్యవసాయ సంఘాల నాయకులు మర్రావు సూర్యనారాయణ, వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

డీఈఓ తాహెరా సుల్తానా

గన్నవరంరూరల్: లక్ష్యంతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని డీఈఓ తాహెరా సుల్తానా ఆకాంక్షించారు. వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం కృష్ణా, ఎన్టీఆర్ ఉమ్మడి జిల్లాల సైన్స్ ఎగ్జిబిషన్(ఫ్యూచర్ ఆన్-2024) జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదవడం, రోజువారి దినచర్యలను క్రమశిక్షణగా నిర్వహించడంతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరేందుకు దోహదం చేస్తుందన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 14 గురుకుల పాఠశాలల విద్యార్థులు 160 ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సైన్స్, మ్యాథ్స్, సోషల్ విభాగాల్లో తమ మేధస్సుకు పదును పెడుతూ ప్రదర్శనలు ఇచ్చారు. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్, సాంగ్స్ విభాగాల్లో సీనియర్, జూనియర్‌లకు పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు డీఈఓ బహుమతులు అందజేశారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించిన ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మిని అభినందించారు. గురుకులాల కో-ఆర్డినేటర్ కె.ప్రేమావతి, ఏపీ గురుకులాల అకడమిక్ మానిటరింగ్ టీమ్ సభ్యులు శాంతి విశాల, ఎంఈఓ కొండా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలిస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా

ప్రణాళిక లేని 'డ్రోన్'



భవానీపురం ఫ్లైఓవర్‌పై నిలిచిన ట్రాఫిక్

- పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు తరలింపు
- కేవలం పది నిమిషాల నిడివితో ముగిసిన డ్రోన్‌షో
- ట్రాఫిక్ కష్టాలు



అలరించిన డ్రోన్ షో

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో జరిగిన డ్రోన్ షో కోసం తరలించిన అన్ని వర్గాల విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజలు అల్లాడిపోయారు. ప్రణాళిక లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి డ్రోన్ సమ్మిట్ పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా భవానీపురం బొబ్బూరి గ్రౌండ్స్‌లో నిర్వహించిన డ్రోన్‌షో కోసం విద్యార్థులను తరలించారు. రాత్రి తొమ్మిది గంటల వరకూ సాగిన ఈ కార్యక్రమం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. కార్యక్రమం నాలుగు గంటలకు అని చెప్పడంతో విద్యార్థులు ఆ సమయానికి అక్కడకు చేరుకున్నారు. వీఐపీలను బబ్బూరి గ్రౌండ్స్‌కు అనుమతించగా విద్యార్థులను, సాధారణ ప్రజానీకాన్ని పున్నమిఘాట్‌లోకి అనుమతించారు. డ్రోన్‌షోలో భాగంగా బబ్బూరి గ్రౌండ్స్‌లో మాత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కానీ పున్నమిఘాట్‌లో ఉన్న వారికి, ఆ చుట్టు పక్కల నుంచి చూస్తున్న జనానికి 8.30 గంటల వరకూ అక్కడ ఏమి జరుగుతోందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. స్క్రీన్లు సైతం ఏర్పాటు చేయకపోవడంతో అందరూ అయోమయానికి లోనయ్యారు. డ్రోన్ షో ఉందో లేదో అర్థం కాక చాలా మంది వెనుదిరిగారు. 8.30 గంటల నుంచి సుమారు పది నిమిషాల పాటు డ్రోన్‌షో జరిగింది. అది ఆకాశంలో ఉండటంతో ఆ విన్యాసాలను అందరూ తిలకించారు. ఇదిలా ఉండగా షో చూడటానికి ప్రజలు రావడంతో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు సైతం సరైన నిర్దేశం లేక వాహనాలను క్రమబద్ధీకరించడానికి అవస్థలు పడ్డారు. పున్నమిఘాట్ తదితర ప్రాంతాలకు తరలించిన విద్యార్థులకు మంచినీరు లేక ఇక్కట్లుకు గురయ్యారు.

తమ్ముళ్లకే ఉపాధి

పెడనకు చెందిన టీడీపీ నాయకుడు ఇటీవల ఓ కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి.. 'అన్న.. మా గ్రామంలో ఉపాధి నిధులతో వేసే సీసీ రోడ్ల పనులు మంజూరయ్యాయి. వాటిని మా నాయకుడు నాకే ఇస్తామని చెప్పారు. పనులపై నాకు కమీషన్ ఇచ్చి, వాటిని మీరే చేయండి. వంద రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. ఎలాగోలా పూర్తి చేయండి. ప్రభుత్వం మాదే. బిల్లుల మంజూరులో మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పాడు'. ఉపాధి నిధులు దక్కించుకున్న టీడీపీ నాయకుల హడావుడి ఇది. కొందరు కాంట్రాక్టర్లను చూసుకుంటే.. మరి కొందరు మాత్రం బినామీగా సొంతంగా చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

- పల్లె రోడ్ల పనులు వారికే
- ఉపాధి పథకం కింద 1,583 పనులు మంజూరు
- వీటి కోసం రూ.111.63 కోట్ల కేటాయింపు
- థర్డ్ పార్టీ పేరుతో టీడీపీ కార్యకర్తలకే పనుల బాధ్యత
- ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితానే ఫైనల్



ఉపాధి నిధులు రూ.15లక్షలతో నిర్మించే పనులకు శంకుస్థాపన చేస్తున్న పెడన ఎమ్మెల్యే(ఫైల్)

సాక్షి, మచిలీపట్నం: ఉపాధి హామీ పనులపై తెలుగుతమ్ముళ్ల కన్ను పడింది. ఉపాధి పనులన్నీ టీడీపీ నేతలకే దక్కాయని ఆరోపణలు వస్తున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను అడ్డదారిలో దక్కించుకొని, తూతూ మంత్రంగా పూర్తి చేసి, అందిన కాడికి నిధులు మింగేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా పల్లెల్లో సీసీ రోడ్లు వేసేందుకు మంజూరు చేసిన పనులను దక్కించుకొని, వాటి నుంచి కమీషన్ల కోసం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్‌ల ఆమోదం, ప్రాధాన్యం, అత్యవసర రోడ్లను కాకుండా అనుకూలమైన రోడ్లను మంజూరు చేయించుకొని, వాటితో సొమ్ము చేసుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.

సర్పంచులపై ఒత్తిళ్లు

గ్రామీణ ప్రాంతాల్లో వేసే రోడ్ల పనులకు సర్పంచ్‌ల ఆమోదం అవసరం. ఆయా గ్రామాల్లో బాగా దెబ్బతిన్న రోడ్లతో పాటు అత్యవసరం ఉన్న రహదారులు నిర్మించడానికి మొదటి ప్రాధాన్యమివ్వాలి. అయితే ఇందుకు భిన్నంగా ముందుగా టీడీపీ, జనసేన కూటమి నాయకుల నుంచి రోడ్ల జాబితాను తీసుకొని, వాటిని ఆమోదించాలని సర్పంచ్‌లపై ఒత్తిడి తెచ్చారు. దీనికి అభ్యంతరం వ్యక్తం చేసిన సర్పంచ్‌లను బెదిరింపులకు గురి చేసినట్లు తెలుస్తోంది. తమ ప్రభుత్వం అధికారంలో ఉందని, సీసీ రోడ్ల జాబితాను ఆమోదించని పక్షంలో ఇబ్బందులు తప్పవని హెచ్చరించినట్లు కొందరు సర్పంచ్‌లు వార్డు సభ్యులతో చెప్పుకున్నట్లు సమాచారం.

రూ.111.63 కోట్లతో 1,583 పనులు

కృష్ణా జిల్లాలో ఉపాధి హామీ నిధుల కింద 1,583 సీసీ రోడ్లు నిర్మించడానికి మంజూరు చేశారు. వీటి కోసం 2024-25 ఆర్థిక సంవత్సరం నిధుల్లో నుంచి రూ.111.63 కోట్లు కేటాయించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ మినహా.. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేసేందుకు మండలాల వారీగా ఎంపిక చేశారు.

టీడీపీ నేతలు ఇచ్చిందే జాబితా

గ్రామీణ ప్రాంతాల్లో వేసేందుకు మంజూరైన సీసీ రోడ్ల జాబితా టీడీపీ నేతలు ఇచ్చేందే అని పల్లెల్లో చర్చ జరుగుతోంది. ప్రాధాన్యమున్న, దెబ్బతిన్న రోడ్లను కాదని, తమ కార్యకర్తలు, నాయకులు కోరిన వాటిని మాత్రమే వేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. గ్రామాల్లోని తమ అనుచరులు ఇచ్చిన రోడ్ల వివరాలతో జాబితాను తయారు చేసి, మండల పరిషత్ అధికారులతో ఆమోదింపజేసినట్లు సమాచారం.

మంజూరైన రోడ్ల వివరాలు

కృష్ణా జిల్లాలోని 1,583 సీసీ రోడ్లు మంజూరు కాగా వీటి కోసం రూ.111.36కోట్లు కేటాయించారు. ఇందులో అవనిగడ్డ నియోజకవర్గంలో 385 రోడ్లకు రూ.23.26కోట్లు, గన్నవరంలో 60 పనులకు రూ.12.75కోట్లు, గుడివాడలో 216 రోడ్లకు రూ.13.97కోట్లు, మచిలీపట్నంలో 324 రోడ్లకు రూ.19.32 కోట్లు, పామర్రులో 296కోట్లకు రూ.16.46కోట్లు, పెడనలో 219 రోడ్లకు రూ.13.30కోట్లు, పెనమలూరులో 83 రోడ్లకు రూ.12.28కోట్లు మంజూరయ్యాయి.

ఏఎన్‌యూకు రానున్న ఎన్ఐఆర్‌ఎఫ్ నిపుణుల బృందం

ఏఎన్‌యూ: ఎన్ఐఆర్‌ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) నిపుణుల బృందం ఈ నెల 25, 26వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించనుందని రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. ఆ రెండు రోజుల్లో యూనివర్సిటీలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఏ విధమైన సెలవులు మంజూరు చేయబడవన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవులు పెట్టుకోవాల్సిన వారు సంబంధిత అధికారుల నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

మైలవరం: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న కేసరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా స్థాయి (మెన్, ఉమెన్) పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు డి. రామ్‌కుమార్ 375 కిలోలు బరువు ఎత్తి బంగారు, సిల్వర్ పతకాలు, కేకే సిద్ధార్థ 370 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం, టి. గోపీచంద్ 350 కిలోల బరువు ఎత్తి సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎన్‌వీ రాజ్‌కుమార్, జిమ్ కోచ్ ఎస్. నటరాజు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అభినందించారు.

క్లుప్తంగా

రూ.3 లక్షలతో వాసవీమాతకు వెండి మకరతోరణం

శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి అలంకరణ



నాగాయలంక: స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీకన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వర స్వామి ఆలయంలో కొలువైన శ్రీవాసవీ మాతకు స్వచ్ఛమైన వెండితో రూపొందించిన రూ.3లక్షల విలువైన మకరతోరణాన్ని పలువురు ఆర్యవైశ్య సంఘం సభ్యులు సంయుక్త వితరణతో సమర్పించారు. ఈ మకర తోరణాన్ని పది మంది ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావుకు అందజేశారు. తొలుత ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో మూడు కిలోల తోరణానికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజ జరిపి దాతలకు అమ్మవారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు అందించారు. తదుపరి వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి అలంకరించారు. మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చిట్టా శివ నాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, ఆకుతోట సీతారామయ్య, మామిడి రాజగోపాల్, చిట్టా వీర అన్నపూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సేవలు ప్రశంసనీయం

జిల్లా ఎస్పీ గంగాధరరావు




కోనేరుసెంటర్: ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో విధులను సమర్థంగా నిర్వహించిన ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు కొనియాడారు. కృష్ణాజిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది విజయవాడ సిటీ సెక్యూరిటీ వింగ్‌కి ఎస్పీగా బదిలీపై వెళ్తున్న ఎస్.వి.డి.ప్రసాద్‌ను అభినందిస్తూ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలోనూ, గన్నవరం విమానాశ్రయం వద్ద రూట్ మ్యాప్, ప్రముఖుల బందోబస్తు విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ఇతర సిబ్బందికి అనుసరణీయమన్నారు. ఎస్పీగా వెళుతున్న ప్రసాద్ అక్కడ కూడా సమర్థంగా విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల మన్ననలను అందుకుంటారని ఆశిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఇతర అధికారులు ప్రసాద్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. బందరు డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్, స్పెషల్ బ్రాంచి సీఐలు శ్రీనివాస్, రంగనాథ్, ఏవో ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యం, ఏఏఓ విజయ్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాంకేతికతతో

వాహన చోరీకి చెక్

- ఒకవేళ దొంగిలించినా దొంగలను ఇట్టే పట్టేయవచ్చు
- వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్‌తో వాహనాలకు రక్షణ
- వీటీఎస్ టెక్నాలజీని వాడుకోవాలంటున్న అధికారులు



కారులో జీపీఎస్‌ను ఇలాంటి చోట్ల బిగించుకోవచ్చు



జీపీఎస్

గుడ్లవల్లేరు: మన ఇంటి ఎదుట సీసీ కెమెరాలున్నా.. లాక్ చేసిన వాహనాలు సైతం చోరీకి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాహనాల చోరీని అరికట్టవచ్చు. ఒకవేళ వాహనాలు చోరీకి గురైనా దొంగలను ఇట్టే పట్టించేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుంది. అదే వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్. ఈ వ్యవస్థ అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే విజయవంతమైంది. మన దేశంలో పట్టణాల్లో ఉపయుక్తమవుతోంది. లక్షల వ్యయంతో లారీలు, కార్లు, బైకులు కొనుగోలు చేసే వాహనదారులు వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్‌ను కొంతఖర్చుతో అమర్చుకోవాలని పోలీసు, రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

జీపీఎస్ శాటిలైట్ ద్వారా సిగ్నల్స్

జీపీఎస్ శాటిలైట్ నుంచి సిగ్నల్స్ వీటీఎస్‌కు వచ్చి అక్కడి నుంచి సెల్ టవర్ ద్వారా సర్వర్‌కు వస్తాయి. వీటీఎస్ పూర్తిగా వెబ్ ద్వారా పని చేస్తుంది. మన వాహనంలో జీపీఆర్ఎస్, ఆర్ఎఫ్‌డీ యూనిట్‌ను అమర్చుకోవాలి. సర్వర్ నుంచి యూజర్‌కు వివరాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయి. వీటిని కంప్యూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, ఐప్యాడ్‌లకు అనుసంధానం చేసుకోవచ్చు. తద్వారా వాహనం ఎక్కడికి వెళ్తున్నా...మొబైల్‌లో చూసుకోవచ్చు.

మార్కెట్లో సెక్యూరిటీ డివైజ్‌లు



టూ వీలర్స్‌కు సైతం సెక్యూరిటీ డివైజ్‌లు మార్కెట్లో అందుబాటులో ఉంటున్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా వెహికల్ డివైజ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని వాహనాలకు అమర్చితే చోరీలకు క్లాం వేసినట్లే. చోరీ చేసినా డివైజ్ యాక్టివేట్ అయి ఇంజిన్ స్టార్ట్ కాకుండా పోతుంది. ఒకవేళ బైక్‌లో డివైజ్‌ను తొలగించినా బైక్ హారన్ మోగటంతో పాటు బండి స్టార్ట్ అవ్వదు. జీపీఆర్ఎస్ ద్వారా బైకిస్ట్ ఫోనుకు అనుసంధానం చేయటం వలన ఆ మొబైల్‌కు సమాచారం వెళుతుంది. ఫోనుకు అలెర్ట్ మెసేజ్ వచ్చేస్తుంది.

ఎన్నెన్నో ప్రయోజనాలు...

- మహిళల ప్రయాణంలో వెహికల్ ట్రాకింగ్‌తో ఎంతో మేలు చేకూరుతుంది. ప్రయాణంలో వారు ఎక్కడ ఉన్నదీ తెలుస్తుంది. గమ్యస్థానం చేరేంతవరకు ఆందోళన చెందకుండా ఉండవచ్చు.
- బ్యాంకులకు భారీ మొత్తం నగదును తరలించేటపుడు ఆ వాహనం ఎక్కడుందో బ్యాంకర్లు తెలుసుకోవచ్చు.
- దూర ప్రాంతాలకు వెళ్లే లారీలు, కార్లు, విలువైన వస్తువులు తీసుకువెళ్లే భారీ కంటైనర్లు ఎక్కడి వరకు వెళ్లాయనే విషయాన్ని తెలుసుకోవడానికి ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది.

టెక్నాలజీతో వాహనాలకు రక్షణ...



సెక్యూరిటీ డివైజ్‌ను వాహనాలకు అమర్చుకుంటే నిద్ర పోయేటపుడు గుండెల మీద చేయి వేసుకుని హాయిగా పడుకోవచ్చు. అదే మన వాహనాలను రక్షిస్తుంది. దొంగిలించిన వాహనంతో తిప్పలు పడలేక మన ఇంటి వద్దే దొంగ వదిలి వెళ్లాలంటే ఈ సిస్టమ్‌ను అమర్చుకోవాల్సిందే.

– ప్రొఫెసర్ డాక్టర్ ఎం.కామరాజు, ఎస్ఆర్‌జీఈసీ డైరెక్టర్

దొంగల్ని ఇట్టే పట్టేయవచ్చు



వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్ దొంగల్ని సైతం ఇట్టే పట్టించేస్తుంది. కార్లు, లారీల యజమానులంతా రక్షణగా సాంకేతిక పరిజ్ఞానాన్ని నమ్ముకుంటే చోరీలను అరికట్టవచ్చు. మా శాఖతో పాటు రవాణా శాఖ వారు కూడా అన్ని వాహనాలకు సాంకేతికతను వినియోగించుకోవలసిందిగా ప్రచారం చేస్తున్నాం.

– ఎస్.వి.వి.సత్యనారాయణ, గుడ్లవల్లేరు ఎస్.ఐ

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్టు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలులో గంజాయి తరలిస్తున్న మహిళను జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జీ.వి రమణ తెలిపిన వివరాల మేరకు రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు డీఎస్పీ రత్నరాజు పర్యవేక్షణలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది మంగళవారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తొమ్మిదో నంబర్ ప్లాట్‌ఫాం ఉత్తర ప్రాంతం చివరిలో కర్ణాటక రాష్ట్రం, హుబ్లీ జిల్లాకు చెందిన రెహానా(41) అనే మహిళ అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఆమె బ్యాగును తనిఖీ చేయగా అందులో 4 కేజీల గంజాయిని గుర్తించారు. విచారణలో నర్సీపట్నంలో గంజాయి కొనుగోలు చేసి హుబ్లీలో చిన్నచిన్న పొట్లాలుగా చేసి అధిక ధరకు విక్రయించేందుకు రైలులో కర్నాటక వెళ్లేందుకు వచ్చినట్లు తెలిపింది. దీంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఓ మహిళ మృతి చెందిన ఘటన విజయవాడ ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ 1–సెక్టార్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇబ్రహీంపట్నంకు చెందిన మేడికొండ రమణ(55) తన కుమార్తె కుమారితో కలిసి నివసిస్తోంది. సోమవారం ఉదయం 10 గంటలకు ఆమె తన పని నిమిత్తం కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆటోనగర్ వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బందరు రోడ్డు గుండా ప్రయాణిస్తుండగా మధ్యాహ్నం 2గంటల సమయంలో చందన గ్రాండ్ సమీపానికి రాగానే వెనుక వైపు నుంచి గుర్తు తెలియని ఒక కారు ఆ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో వారిద్దరు కిందపడిపోగా రమణకు బలమైన గాయాలయ్యాయి. ఆమె కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం సోమవారం రాత్రి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో రమణ మృతి చెందింది. మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

93 పరుగుల తేడాతో ఆంధ్రా విజయం



రెండో ఇన్నింగ్స్ ముగిసిన తరువాత విజయదరహాసంతో మైదానం నుంచి వస్తున్న ఆంధ్రా జట్టు

విజయవాడస్పోర్ట్స్: మూలపాడులోని ఏసీఏ మైదానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న బీసీసీఐ కల్నల్ సి.కె.నాయుడు ట్రోఫీ అండర్–23 పురుషుల మల్టీ డే మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్, ఫాలో ఆన్ మ్యాచ్‌ల్లో ప్రత్యర్థి మేఘాలయ బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేసి 93 పరుగుల తేడాతో గెలిచింది. ఈ నెల 20వ తేదీన ఈ మ్యాచ్ ప్రారంభమైంది. తొలి రోజు ఆంధ్రా జట్టు 62 ఓవర్లకు రెండు వికెట్లు నష్టపోయి 373 పరుగులు చేసింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 66.4 ఓవర్లకు మొత్తం మూడు వికెట్లు నష్టపోయి 402 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు బ్యాట్స్‌మెన్‌లను ఆంధ్రా బౌలర్లు 66.4వ ఓవర్ వద్ద 184 పరుగులకు కట్టడి చేశారు. ఈ మ్యాచ్‌లో ఆంధ్రా బౌలర్లు వాసు 6, ఇస్మాయిల్ 2 వికెట్లు తీశారు. మంగళవారం జరిగిన రెండో ఇన్నింగ్స్ ఫాలో ఆన్ మ్యాచ్‌లో మేఘాలయ బ్యాట్స్‌మెన్‌లను ఆంధ్రా బౌలర్లు 64.4 ఓవర్ వద్ద 125 పరుగులకు కట్టడి చేశారు. ఈ మ్యాచ్‌లో ఇస్మాయిల్ 8 వికెట్లు తీశాడు. అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో ఆంధ్రా జట్టు 16 పాయింట్లు కైవసం చేసుకుంది. మేఘాలయ జట్టు రెండు పాయింట్లకే పరిమితమైంది.

నాలుగు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

అవనిగడ్డ: అక్రమంగా తరలిస్తున్న నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని స్థానిక ఎస్ఐ కె.శ్రీనివాసరావు పట్టుకున్నారు. అక్రమ రేషన్ బియ్యం తరలింపు సమాచారం తెలుసుకున్న ఎస్ఐ స్థానిక స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో నాలుగుటన్నుల అక్రమ బియ్యంను తరలిస్తున్న పెదకళ్లేపల్లి గ్రామానికి చెందిన కూతాడ వెంకన్నబాబుని అదుపులోకి తీసుకున్నారు.

ఈ మేరకు అతనిపై సస్పెక్టెడ్ షీట్ ఓపెన్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి

ప్రభుత్వానికి బీఏఐ వినతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వివిధ రకాల హెడ్స్ ద్వారా పెండింగ్‌లో ఉన్న బిల్స్ రూ.2 వేల కోట్లు కాంట్రాక్టర్లకు విడుదల చేయాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘ చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు, డి.పంకజ్‌రెడ్డి, బి.రాఘవరావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మెయింటెనెన్స్ పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లకు రావాల్సిన పేమెంట్స్ వెంటనే రిలీజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇసుక విషయంలో అనేక సమస్యలు ఉన్నాయని, అన్ని క్వారీలను ప్రారంభించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గతంలో మైనింగ్ సెస్ వసూళ్లు ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించే వారని, వర్క్స్ కాంట్రాక్టర్స్‌కు సీనరేజ్, సెస్ వసూళ్లు బిల్‌లో మినహాయించి పేమెంట్ చేసే విధానం అమలులో ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇదే విధానాన్ని కొనసాగించాలని వారు కోరారు. ప్రభుత్వం నుంచి ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్‌నుంచి రావాల్సిన రూ.745 కోట్లు, పంచాయతీరాజ్ విభాగం నుంచి రావాల్సిన రూ.2122.54 కోట్లు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టర్లకు ఊరట కలిగిస్తూ ఇటీవల కొంత బడ్జెట్ రిలీజ్ చేశారని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పలువురు బీఏఐ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్ భర్తపై హత్యాయత్నం

జగ్గయ్యపేటఅర్బన్: మున్సిపల్ 20 వ వార్డు కౌన్సిలర్ నోముల స్వప్న భర్త, బీజేపీ నాయకుడు నోముల రఘుపై మంగళవారం పట్టణంలో హత్యాయత్నం జరిగింది. బాధితుడి ఫిర్యాదుమేరకు పట్టణ ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రఘు మీడియాతో మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం తాను తన ఇంటి నుంచి చిల్లకల్లు రోడ్‌లో ఉన్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సోదరుడు శ్రీరాం చినబాబు ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకు స్కూటీపై వెళుతుండగా ఎస్‌జీఎస్ కళాశాల సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా కారులో నలుగురు దుండగులు మంకీ క్యాప్‌లు ధరించి వచ్చి తన ముందు కారు ఆపి తనపై దాడికి ప్రయత్నించారని తెలిపారు. తాను వారిపై తన వాహనాన్ని నెట్టివేసి దూరంగా పారిపోయి, తొర్రగుంటపాలెంలోని తన మిత్రుని ఇంటికి వెళ్లానని, పోలీసులు వచ్చాక బయటకు వచ్చానని చెప్పారు. తనపై దాడి చేయించింది మాజీ ప్రభుత్వ ప్రజాప్రతినిధి, ఇటీవల జనసేన పార్టీలోకి వెళ్లిన నాయకుడేనని నోముల రఘు ఆరోపించారు. భవిష్యత్‌లో తనకు ఎటువంటి ప్రాణహాని జరిగినా అందుకు ఆయనే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగావకాశాలు

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ–సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్, ఈకామ్ ఎక్స్‌ప్రెస్ వంటి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 83 మంది హాజరుకాగా, వీరిలో నైపుణ్యం కనబరిచిన 52 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ–సీడాప్‌తో కలిసి జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ ఎస్.నరేష్‌కుమార్, అదనపు అధికారి డీవీ సందీప్, కళాశాల ప్రిన్సిపాల్ వీవీ కృష్ణమోహన్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుజిత్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

దాడుల్లో కాసుల వేట?

- భారీ మొత్తంలో నగదు దొరికినట్లు ప్రచారం
- కీలక వ్యక్తులను తప్పించినట్లు వినికిడి

కంకిపాడు: జూద శిబిరాలపై దాడులు విస్తృతంగా జరుగుతున్నాయి. జూదరుల ఆట కట్టించే పనిలో పోలీసులు ఉన్నారు. ఇది ఓ కోణమైతే.. దాడుల్లో అందినకాడికి సరిచేస్తూ యథేచ్ఛగా కాసుల వేట సాగిస్తున్నారన్నది మరో కోణం. ముఖ్యమైన వ్యక్తులను తప్పించటం దగ్గర నుంచి ప్రతి పనిలోనూ పందెం రాయుళ్లకు భరోసా ఇచ్చారని తెలుస్తోంది. ఇటీవల కంకిపాడు కేంద్రంగా సాగిన కోడిపందేల శిబిరంపై దాడి ఈ బహిరంగ విమర్శలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. కొందరు పోలీసులు ఇందులో ముఖ్యభూమిక పోషిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే...

దొరికింది రూ.25 వేలే అట?

కంకిపాడు శివారు గాయత్రీ విహార్‌లో ఇటీవల కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడులు జరిపారు. దాడుల్లో 29 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు పందెం పుంజులు, 10 కత్తులు, రూ.25,040 నగదు, 8 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడి, అందులో స్వాధీనం చేసుకున్న నగదు వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. అంతమంది పందెంరాయుళ్లు ఉంటే కేవలం రూ.25 వేలు మాత్రమే దొరకటం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇందులో కొందరు ముఖ్యులైన వ్యక్తులను తప్పించారని, ఇందులో జనసేన పార్టీకి చెందిన నియోజకవర్గ ముఖ్యనేత పోలీసుస్టేషన్‌లో అదే రోజు రాత్రి మంతనాలు జరిపి తమ వర్గానికి కొమ్ము కాసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పోలీసు అధికారి, ఆ నేతకు మధ్య తేడా రావటంతో పోలీసుల వ్యవహార శైలిపై ఆ పార్టీ నేతలు సైతం గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. అయితే తమ వ్యక్తులను కొందరిని తప్పించటంతో శాంతించినట్లు వినికిడి.

భారీ స్థాయిలో పందేలు

గాయత్రీ విహార్ కేంద్రంగా కొద్ది రోజులుగా భారీ స్థాయిలో కోడిపందేలు నడుస్తున్నట్లు సమాచారం. కంకిపాడుకు చెందిన జనసేన పార్టీ సామాజిక వర్గ యువకుడు ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. అతడు కొందరు జనసేన పార్టీ సీనియర్లను కలుపుకొని నిత్యం భారీ స్థాయిలో కోడిపందేలు ఆడించినట్లు తెలిసింది. పోలీసులు దాడి చేసిన రోజు తాడేపల్లిగూడెం నుంచి ఐదుగురు, చల్లపల్లికి చెందిన జూదరులు, స్థానికులతో కలిసి రూ.1 లక్షకు పందెం ఒప్పందం చేసుకుని పందెం వేశారు. స్థానికులు కొందరు ఇచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అయితే దాడిలో మాత్రం కేవలం రూ.25 వేలు దొరకటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంకిపాడు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిని పోలీసులు అర కిలోమీటరు వెంబడించి మరీ పట్టుకోగలిగారు. జూదరుల వద్ద భారీగానే నగదు దొరికినట్లు బహిరంగ ప్రచారం జరుగుతోంది. అసలు దొరికింది ఎంత? ఆ సొమ్ము ఏమైంది? పోలీసు సిబ్బంది చక్రం తిప్పారా అన్న ప్రశ్నలపై తీవ్రంగా చర్చ జరుగుతోంది.

యార్డుకు 30,429 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 30,429 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 28,133 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 24,612 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.